89

# సారె సారెకున్...

మానవేతిహాసంలో మట్టికున్న ప్రాధాన్యం మరొక దానికి లేదేమోననిపిస్తుంది. ప్రాణి జన్మించింది. మట్టిలో కలిసిపోతున్నది. ఈ మట్టి కోసం గతంలో మహాయుద్ధాలు జరిగాయి. కోట్లాది మానవులు ఈ మట్టికోసం పోరాటాలు జరిపి నెత్తుటితో మట్టిని పంకిలం చేసి చివరకి ఆ మట్టిలోనే కలిసిపోయారు. చారెడు మట్టికోసం బారెడు నేలకోసం మనమింకా మారణకాండను నడపడానికి సిద్ధంగా వున్నాం. ఈ మట్టిలోంచి మనక్కావలసినవన్నీ పిండుకొంటున్నాం. ఈ మట్టిలోనే తిరిగి చేరుతున్నాం. మనం నమ్ముకొన్నదీ. మనం తన్నుకొన్నదీ ఈ మట్టి కోసమే.

మనిషికి లోహాలతో పరిచయం ఏర్పడడానికి అనేక వేల సంవత్సరాల ముందే, మట్టితో పరిచయముంది. మట్టితో రకరకాల పాత్రలను చేయడం నేర్చుకున్నాడు. ఆనాటి మృణ్మయ పాత్ర శిథిలాలు ఈనాటికి భూగర్భ త్రవ్వకాలలో లభిస్తున్నాయి. ఆ శిథిలాల ఆధారంగా అప్పటి వారి జీవన విధానాన్ని కనుగొనడానికి మనం ప్రయత్నిస్తున్నాం.

బంకమట్టితో పాత్రలను చేయడం మనిషికి తెలిసి వేలాది సంవత్సరాలయిందనుకొన్నాం. గదా. ఈ లెక్కన గురవయ్య చేసే పని వయస్సు కూడా వేల సంవత్సరాలే అయి వుంటుంది. చిత్రమేమిటంటే, ఇన్ని వందల శతాబ్దాల కాలంలో అన్ని వృత్తుల రూపు రేఖలూ అంతో యింతో మారిపోయాయి. అట్టే ఎదుగూ బొదుగూ లేకుండా అనాది మానవ సమాజం అవలంభించిన పద్ధతుల్లోనే నడుస్తున్న వృత్తి ఇదొక్కటేనేమోననిపిస్తుంది.

గురవయ్యకి వృత్తి ఒకరు నేర్పితే వచ్చింది కాదు. అని రక్తంలోనే ఈ పనికి కావలసిన నైపుణ్యమంతా నిండి వుంది. అతని ముత్తాతల ముత్తాతల దగ్గరనుండీ ఈ పని చేస్తున్నారు. అతనూ ఇప్పుడదే చేస్తున్నాడు.

"ఇంకా ఎక్కువ కాలం ఈ పని చేసుకొని బతకలేం బాబు కూలీ గిట్టదు". అన్నాడు గురవయ్య చుట్ట కొన కొరికి దూరంగా వుమ్ముతూ.

గురవయ్య చదువుకోలేదు. చదువుకొంటే ఆయుష్షు తగ్గుతుంది అని ఎవరో తన తండ్రికి చెప్పారుట. అదీగాక గురవయ్య వున్న వూళ్ళో సర్కారు బడిలేదు. ఆ చుట్టు పక్కల రెండు మూడు కోసుల దాకా కూడా లేదు. ఉన్న వూళ్లో రామానుజాచార్ల వారు వీధి అరుగుమీద పదిమంది పిల్లలకు పాఠాలు చెప్పేవారు. అమితు ఆ పదిమందీ కలిగినవారి పిల్లలు. వారి సరసన కూచోడానికి ఎన్ని గుండెలు కావాలి? తనకు కూచోవాలని వున్నా తన అయ్య వొప్పుకోవాలి గదా.

"మా నాన్న సంగతి మీకు తెలియదుగానండీ, అదుగో ఆ చూరు ఎత్తున వుండేవాడు. చెవలకి బంగారు పోగులు, వెండి మొలతాడు, చేతికి రాగికడియం, మెడలో ఆంజనేయుల వారి బిళ్ళా, బుగ్గ మీసాలు, జుట్టు ముడి. ముగ్గురి తరువాత నేనే బతికానంటండి, అందుకనే మా నాన్నకు నేనంటే చచ్చే ప్రేమ. నేనూ దక్కకుండా పోతనేమోనని నాకు చదువు చెప్పించలేదు" అన్నాడు గురవయ్య.

తన చిన్నప్పటికీ ఇప్పటికీ ఊరు పరిస్థితి బాగా మారిపోయిందన్నాడు గురవయ్య.

''ఆ రోజుల్లో గాబులు, బానలు, కుండలు కడవలు, మూకుళ్ళు, ముంతలు, చట్టిపిడతలు, ప్రమిదలు, గురుగులు ఇంకా నన్ను కట్టుకుపోయినన్ని సామాన్లు తయారు చేసేవారు. మా నాన్న మట్టసానికి 'గరిసెలు' కూడా తయారు చేసేవాడండి. ఆయన చేసిన గరిసెలింకా బెచ్చిక రాకుండా రాంకోటయ్య గారింట్లోనూ పెదసాంబయ్య గారింట్లోనూ ఉన్నాయి. దాన్నిండా గింజలు పోసుకొని దాచుకొనేవారు. అసలీ మాయ వెండి అదే జర్మన్ సిల్వర్ రావడంతో మా కూట్లో దుమ్ము పడ్డది. పట్నాల్లో మా మట్టి సామాన్లు వాడే వాళ్ళే లేరుగా బాబయ్యా. ముద్ద వున్నా లేకపోయినా డాబుసరి కోసమైనా అల్యూమినియంనీ, స్టీలునీ వాడుతారాయె... ఇంకేం బతుకుతాం చెప్పండి'' అన్నాడు.

తన తండ్రి కుండలు చేసినా, బానలు చేసినా, పిడతలు చేసినా, ఎవ్రయేగాణీ తీసుకొనేవారు కాదుట. తమకు ప్రత్యేకంగా కొన్ని యిళ్ళు వుండేవనీ ఆ ఇళ్ళ వాళ్ళక్కావలసిన కుండా చట్టీ తామిస్తే, తమక్కావలసిన గింజా, గిటకా వారు కొలిచేవారనీ చెప్పుకొచ్చాడు గురవయ్య.

అసలు కరువనేదే ఎరుగమండీ, ఏ అయ్య కళ్ళం దగ్గర కెళ్ళినా గూడ కుంగిపోయేది- మూట మొయ్యలేక, దతెంత తీసుకొని బజార్నపడితే మూడిళ్ళన్నా తెరక్కముందే మజ్జిగతో దుత్తనిండిపోయేది. శనగలు, కందులు, అలసందలు, ఉలవలు - సరే. ఇంక జొన్నలన్నా సజ్జలన్నా, మొక్కజొన్నలన్నా కరువేలేదనుకోండి. ఇన్ని కుండలిచ్చామన్న లెక్క మాకు వుండేది కాదు. సుబ్బన్న ఇన్ని సార్లు మనింటికొచ్చి, అవీయివీ తీసుకెళ్ళాడన్న ఆలోచన వారికీ వచ్చేది కాదు. పెళ్ళిళ్ళయితేనండి ఖర్చంతా ఊరే పెట్టుకొనేది. ఆవం కాల్చాలనుకొన్నామంటే- వారం రోజులు ముందుగా ఓ అయ్యబీట్లో వో నాలుగు తుమ్మల పేళ్ళేసుకుంటే సరిపోయేది. ఇప్పుడంతా డబ్బుతో ముడిపెట్టుకొని చచ్చిపోతున్నాం'' అని విసుక్కున్నాడు గురవయ్య.

గురవయ్య యిల్లు వూరికి చివరగా వుంది. ఆ యింటి పక్కనే చిన్న 'ఆవం' వుంది. దానికి అటూ యిటూ పిచ్చికుసుమ, కసింద మొక్కలూ మొలిచాయి. గురవయ్య భార్య దారప్పోగులా వూగిసలాడుతూ చింత చెట్టు అవతల్నించీ నీళ్ళు తెచ్చి, మొగ్రిబోయిన గాబును నింపుతున్నది.

''ఈ పనిని వదలలేను. ఇంకోపని చేతకాదు. నిరుటి వానలకు చేసిన కుండలన్నీ కుప్పబడిపోయాయండీ. మళ్ళీ మొదలెత్తుకోవలసి వచ్చింది. ఈ ఏడు ఫర్వాలేదనుకోండి. బస్తీలకా? అక్కడికెళ్ళినోళ్ళ బతుకు చూస్తూనే వున్నాంగదండీ. మట్టి కుండలకి బస్తీలో గిరాకీ వుండదని మీకు తెలియందా బాబూ'' అన్నాడు గురవయ్య.

మూడేళ్ళ కిందటి కన్నా, ఇప్పుడు తనబతుకు మరీ బరువుగా తయారయిందంటూ దానికి కారణాలు కూడా చెప్పుకొచ్చాడు గురవయ్య.

''ఆ మధ్య మా పక్క వూరికి కరెంటు ఇచ్చారండి. పదిహేను, ఇరవై బావులకు మోటార్లు పెట్టారు. పంటలు బాగా పండినయ్. నాలుగు పిక్కలు చేతిలో ఆడటం మొదలయ్యేసరికి కుండా చట్టీ పనికి రాకుండా పోయాయి'' అన్నాడు గురవయ్య సారె మీద మట్టి ముద్దను పెడుతూ.

చూస్తూ చూస్తూ వుండగానే, అతనివేళ్ళు ఆ మట్టి ముద్దలోంచి పిడతను వెలికితీసాయి. అలా వొకదాని తరువాత మరొక వస్తువులు రూపం దిద్దుకొంటూ ఆవరణంతా నిండిపోతున్నది.

''ఇవి తేమ ఆరాలి అడుగులు ముయ్యాలి. చరవాలి, కాల్చాలి, కొన్ని పారుబోతాయి. మిగిలిన

వాటిలో సొట్టలు పోయినవీ, చిల్లులు పడినవీ, పగిలినవీ కాక, మిగిలిన వాటిని అమ్మితే వచ్చే డబ్బుల్తో పొట్ట నింపుకోవాలి. సముద్రాలన్నా నిండుతయేమోగానీ ఈ జానెడు పొట్టా నిండడం లేదు బాబూ'' అన్నాడు గురవయ్య గడకర్రతో సారెను ఉడాయించి తిప్పుతూ.

నిజమే-

గురవయ్య జానెడు పొట్టా దిగుల్లేకుండా నిండే రోజు ఎప్పుడొస్తుందో?